సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 84 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 17.07.2025



## ప్రభంజన్ పార్థివ దేహం మెడికల్ కాలేజీకి..

- సామాజిక ఉద్యమ ధీరుడు ప్రొఫెసర్ ప్రభంజన్
- ప్రముఖుల ఘన నివాళి

పేజీ 2



# ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం

- నియోజకవర్గ అభివృద్ధే నా ఎజెండా
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జాఫర్‌గఢ్, మన చౌరాస్తా :**

చరిత్రలో నిలిచిపోయే విధంగా సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అమలు అవుతున్నాయని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారుజిల్లాలోని జాఫర్‌గఢ్ మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆహార భద్రత (కొత్త రేషన్) కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కడియంతో పాటు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం నడుస్తుందన్నారు. గత పది సంవత్సరాలుగా ఎంతోమంది నిరుపేదలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి రేషన్ కార్డులను పంపిణి చేసి మనస్థ్యైర్యాన్ని అందించాలని ఈ నెల 14 న రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా జనగామ జిల్లాలోని జఫర్గఢ్ మండలంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈరోజు ఒక పండుగ వాతావరణం నెలకొందని, గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డు ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ లబ్ధిదారులు తిరుగుతూ ఇబ్బందులు పడేవారని, ప్రభుత్వం ఏర్పడగానే ప్రజాపాలనలో, మీ సేవలో అలాగే నేరుగా అధికారులకు రేషన్ కార్డు మంజూరు కోసం వచ్చిన దరఖాస్తుల విచారణ అనంతరం అర్హులైన వారికి పంపిణీ చేస్తున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మొట్టమొదటిగా పేద లబ్ధిదారులకు రేషన్ కార్డు లను పంపిణీ చేసేందుకు కృషి చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్ జిల్లా యంత్రాంగాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ఎందరో నిరుపేదల చిరకాల వాంచ నెరవేరిందన్నారు. రెండు విడుతలలో రేషన్ కార్డులను అందించేందుకు కార్యాచరణను మొదలుపెట్టామన్నారు. మీ సేవలో పెండింగ్ ఉన్న దరఖాస్తులతో పాటు రెగ్యులర్ గా వచ్చే దరఖాస్తులను కూడా విచారించామని.. అలాగే ప్రజాపాలన, గ్రామ సభలో వచ్చిన దరఖాస్తు లను క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నేటి నుంచి జిల్లాలో కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. అన్ని విధాలుగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించే విధంగా అధికారులు కృషి చేశారన్నారు. జాఫర్‌గఢ్ మండలానికి 648 కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే 859 మందిని కొత్తగా రేషన్ కార్డులో చేర్చామన్నారు. ఈ మండలంలో 7లక్ష 49 వేల కేజీల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా మొత్తం 1,63,283 కార్డులు ఉండగా... 7,604 మందికి కొత్త రేషన్ కార్డులు, 14,880 మందిని కొత్తగా రేషన్ కార్డులో నమోదు చేశామన్నారు. ఇది నిరంతరం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం మండలంలోని ఇంటర్ కాలేజీలో వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, ఆర్డివో, సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** సమాజంలో మనోస్థైర్యంతో ముందుకెళ్లాలనే యోచనతో దివ్యాంగులకు భవిత కేంద్రాలు శిక్షణనందిస్తున్నాయని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. బుధవారం స్టేషన్ఘనపూర్ లోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న వసతులను పరిశీలించి, పిల్లల సామర్థ్యలను కలెక్టర్ తెలుసుకున్నారు. టాయిలెట్ నిర్మాణాన్ని పరిశీలించి కొన్ని మార్పులు చేయాలని ఆర్ అండ్ బి డీఈ సతీశ్‌కు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని భవిత కేంద్రాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు నిధులను మంజూరు చేశామన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల జీవితాలను మెరుగుపరచడంలో భవిత కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, జడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, భవిత కేంద్ర టీచర్ తదితరులు పాల్గొన్నారు.



# కుట్టు మిషన్ల పంపిణీ


**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీసీఎంఎఫ్‌సీ) ద్వారా జనగామ జిల్లాలోని పేద, నిరుద్యోగ, అర్హత, శిక్షణ పొందిన క్రిస్టియన్ మహిళలకు 'ఇందిర మహిళా శక్తి' పథకం కింద జనగామ నియోజక వర్గానికి ఐదు ఉచిత గృహ కుట్టు యంత్రాలు మంజూరయ్యాయి. వాటని బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా. బి.విక్రం కుమార్, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి పాల్గొన్నారు.






# ప్రభంజన్ పార్థివ దేహం
# మెడికల్ కాలేజీకి..

**జనగామ, మన చౌరాస్తా :** సామాజిక ఉద్యమ నాయకుడు, అట్టడుగు వర్గం నుంచి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు సాధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేసి తెలంగాణ కోసం ఉద్యోగాన్ని వదిలి తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ సామాజిక తెలంగాణ సాధన కోసం తుది శ్వాస వరకు పోరాటం చేసి బుధవారం తెల్లవారు జామున కన్నుమూశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో ఒక సామాన్య గొర్రెల కాపరి యాదవ కుటుంబంలో యాదనాల కొమరమ్మ, సోమయ్య దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించిన డాక్టర్ యాదనాల ప్రభంజన్ యాదవ్ మొట్టమొదటి సారిగా గ్రామం నుంచి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ సాధించి ఆల్ ఇండియా రేడియోలో విధులు నిర్వహించి, న్యూ డిల్లీ జాతీయ ప్లానింగ్ కమిషన్‌లో పీఆర్ఓ గా పనిచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీనామా చేశారు. విద్యార్థి దశ నుండే ప్రగతిశీల వామపక్ష ఉద్యమాల కీలకపాత్ర పోషిస్తూ డోలు దెబ్బ, యాదవ ఇంటలెక్షన్ ఫోరం, సామాజిక తెలంగాణ జాక్ ఏర్పాటు చేసి నిరణతరం ప్రజలను చైతన్యం చేయడమే కాకుండా దొడ్డి కొమురయ్య చిత్రాన్ని మొట్టమొదటగా చేయించిన వ్యక్తి, సత్యశోధక సామాజిక విద్యాపీఠం స్థాపించి ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించారు. గద్దర్ తో పాటు జననాట్యమండలిపై తన ఎంఫిల్ థీసిస్ ప్రజెంట్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బిఎస్పి పార్టీ జనరల్ సెక్రటరీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ అనేక ఉద్యమ సంఘాలతో కలిసి పని చేశారు. ఆ తర్వాత తెలంగాణ యూనివర్సిటీలో జర్నలిజం విభాగంలో ప్రొఫెసర్ గా తన సేవలను కొనసాగగించి పదవీ విరమణ పొందారు. సామాజిక ఉద్యమకారుడిగా తెలంగాణ జన సేన స్థాపించి సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా అహర్నిశలు పరితపించిన ప్రభంజన్ మండల్ టీవీ ని స్థాపించి సోషల్ మీడియా ఛానల్ ద్వారా ఉద్యమాలు చివరి వరకు కొనసాగిస్తూ తుది శ్వాస వరకు సామాజిక న్యాయం కోసం మేం ఎంతో మందిమో మాకు అంత వాటా నినాదంతో బహుజన ఉద్యమాన్ని నడిపిస్తూ అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. బహుజన మీడియా, ద వాయిస్ ఆఫ్



వాయిస్ లెస్ లాంటి ఎన్నో పుస్తకాలను రచించి బ్రతికున్నంత కాలం విద్యార్థులకు, సమాజానికి ఉపయోగపడినట్లే తన మరణానంతరం కూడా వైద్య విద్యార్థులకు తన శరీరం ఉపయోగపడాలనే సామాజిక స్ఫూర్తితో చివరగా తన భౌతిక దేహాన్ని సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కి సమర్పించారు. ప్రభంజన్ మహోన్నతమైన ఆశయాన్ని కొనియాడుతూ వారి ఆశయాన్ని గౌరవించి నెరవేర్చిన భార్య డాక్టర్ రేఖ, కుటుంబ సభ్యులు పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు ఇచ్చినందుకు పలువురు ప్రముఖులు అభినందించారు. కుమారులు విశ్వామిత్ర, సత్యశోధక్ సోదరులు రమేష్, శ్రీనివాస్, వీరాస్వామి, డాక్టర్ దాడబోయిన శ్రీకాంత్, బావలు రవీంద్ర, బద్రి, రాంచందర్, రాజయ్యలకు గ్రామ మాజీ సర్పంచులు పుల్లయ్య, కొంరయ్య పోతన చైతన్య వేదిక సభ్యులు, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, వరంగల్ ఉమ్మడి జిల్లాల ప్రతినిధులు కర్రేటి శంకర్రావు, సి.హెచ్ దళపతి, ధర్మపురి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.





# స్థానిక ఎన్నికల్లో మాదే గెలుపు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుచిదే బీఆర్ఎస్ పార్టీనేనని ఆ పార్టీ ఇన్‌చార్జి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి, గోపాల్ నగర్, చిన్న రాంచర్ల గ్రామాల్లో బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీలు మేకల రాం ప్రసాద్, మహమ్మద్ గులాం బాయ్, మహమ్మద్ యాకుబ్ పాషా, ఇర్రి రమణారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఉద్యోగుల వంటావార్పు

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిసన్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వంటావార్పు ప్రోగ్రాం జనగామ జిల్లాలో విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో నిర్వహించారు. ఒకే సంస్థలో ఒకే రూలు అమలు చేయాలని, విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర జేఏసీ చైర్మన్ కే.ఈశ్వరరావు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ.చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు కే. వెంకటేష్, వి.నరేందర్, జనగాం జిల్లా జాక్ చైర్మన్ మాట్ల ప్రభాకర్, కన్వీనర్ జక్కుల యాకుబు, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ మాచర్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ బస్ డిపో ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగొని సుమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రెటరీ మమత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లా కేంద్రానికి చదువు కోసం వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యాలు లేక ప్రైవేటు వాహనాలలో వచ్చే స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



# ఘనంగా వన మహోత్సవం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో గల 13 షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహాలు, 5 రెసిడేన్షియల్ స్కూలలో వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు . వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లలో గత వారం రోజులుగా మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం జనగామ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వన మహోత్సవం ప్రాధాన్యత, పర్యావరణం, జీవ వైవిధ్యంలో శాస్త్రవేత్తల పాత్ర తదితర అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డా.విక్రం కుమార్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్స్, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# నడి రోడ్డుపై నవజాత శిశువు

- ఖిలాషాపురంలో అమానవీయ ఘటన
- శిశువును కాపాడిన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో అమానవీయ సంఘటన చోటుచేసుకుంది. రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం గ్రామంలో గుర్తుతెలియని తల్లి అప్పుడే పుట్టిన పసికందును రోడ్డుపై వేసి వెళ్లిపోయింది. బుధవారం తెల్లవారుజామున పసిపాప ఏడుపు వినిపిస్తుండడంతో గ్రామస్తులు అప్పుడే పుట్టిన మగ శిశువు ను గుర్తించారు. స్థానిక మహిళ పసి బాబును అక్కున చేర్చుకుని స్నానం పోసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్, ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖల సమన్వయంతో శిశువు రక్షణ చర్యలు చేపట్టారు. నవజాత మగ శిశువు మొదట రఘునాథపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి అక్కడ ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన చికిత్స కోసం జనగామ ఎంసీహెచ్‌కు తీసుకువెళ్లారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉన్నాడని ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డా.మధుసూదన్ ,డాక్టర్ ఉదయ్ తెలిపారు. డీడబ్ల్యూ వో ఫ్లోరెన్స్, డీసీపీవో రవికాంత్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ రవికుమార్, డీసీపీయూ సీహెచ్ఎల్ సిబ్బంది ప్రణయ్, లావణ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, ఖిలాషాపూర్ అంగన్వాడీ టీచర్లు రేణుక, రుచేంద్ర, ఆశావర్కర్ శాంత శిశువు కాపాడడంలో పాల్గొన్నారు.



# పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేయాలి

**బచ్చనపేట, మన చౌరాస్తా :** జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని రామచంద్రపురం, ఇటికాలపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించగా కార్యక్రమానికి ఇన్‌చార్జిలు పెద్ది రాజి రెడ్డి, సీనియర్ నాయకులు గద్దల నరసింగ రావు పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, పార్టీ నిర్ణయించిన వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలన్నారు. పార్టీ నిర్ణయం మేరకు కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బోడిగం చంద్రారెడ్డి, గుర్రం నాగరాజు, కృష్ణ, కొండ మల్లికార్జున్, బిట్ల శంకర్, ఇట్కలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, ఎంపీటీసీ దూడల కనకయ్య గౌడ్, సీనియర్ నాయకులు బ్రహ్మచారి, మండల సోషల్ మీడియా కన్వీనర్ పడిగల కరుణాకర్ రెడ్డి, రామచంద్రపురం గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రమౌళి, సీనియర్ నాయకులు కనకయ్య, కాగితాల నాగరాజు, ఇరు గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# వర్షాల కోసం జలాభిషేకం

**బచ్చనపేట, మన చౌరాస్తా :** వర్షాలు కురవక చెరువుల్లో నీళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండడంతో మండల కేంద్రంలోని ప్రజలు బుధవారం బచ్చన్నపేట పట్టణంలోని చెన్నకేశవ ఆలయంలో గల శివలింగానికి జలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వానదేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిపించి పంట పొలాలు బాగా పండే విధంగా చూసి రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుష్ప బాలకిషన్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ పులిగిల్ల చందు, బచ్చన్నపేట గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్ రాజు, గ్రామస్తులు కొత్తపల్లి రాజయ్య, నర్ర మహేందర్ రెడ్డి, చిమ్ముల సుధాకర్ రెడ్డి, పిన్నర్ సురేందర్, నర్ర లక్ష్మారెడ్డి, కుమ్మరి సత్తయ్య, అట్లా అంజిరెడ్డి, గోలి బుచ్చిరాజు, కుమ్మరి శ్రీను, కూరెళ్ళ వెంకట్రెడ్డి, ఎండి గౌస్, సిమ్ముల రామచందర్ రెడ్డి, అట్ల సుధాకర్ రెడ్డి, మహిళలు గోలి మహేశ్వరి, కంటే మంజవ్వ, కుమ్మరి పద్మ, చిమ్ముల సరిత, మంచాల కవిత, కోన అమరేశ్వరి, పాతూరి మంజుల, అట్ల విజయ, తదితరులు పాల్గొన్నారు.

## పీఎస్‌హెచ్ఎం టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



**జనగామ, మన చౌరాస్తా :** పీఎస్‌హెచ్ఎం అసోసియేషన్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన టేబుల్ క్యాలెండర్ డీఈవో భోజన్న బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల మురళి, ప్రధాన కార్యదర్శి వేల్పుల చందయ్య, కుమార స్వామి, వెంకటేశ్వర్లు, బుక్కాల శ్రీనివాస్, కొర్లపాటి వినోద రాణి, జనగామ మండల ఉపాధ్యక్షురాలు నల్ల లలిత, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో పీఎస్ హెచ్ఎంలను నియమించాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయులను నియమించాలని, సీనియర్ పీఎస్ హెచ్ఎంలకు గెజిటెడ్ హోదా, సెక్టోరియల్ ఆఫీసర్‌గా అవకాశం కల్పించాలని కోరారు.

## ప్రభంజన్ యాదవ్ మరణం

# బీసీ ఉద్యమాలకు తీరని లోటు

**జనగామ, మన చౌరాస్తా :** ప్రభంజన్ యాదవ్ తెలంగాణ కోసం బీసీల రాజ్యాధికారం కోసం పరితపించిన నాయకుడు. చైతన్యానికి ప్రతీకైన జనగామ గడ్డన పట్టిన బిడ్డ తెలంగాణ సాధన ఆకాంక్ష నెరవేరింది బీసీల రాజ్యాధికార లక్ష్యం నెరవేరకుండానే మరణించటం బీసీ ఉద్యమాలకు తీరని లోటనీ బీసీ సంఘాల సమన్వయ కర్త కన్న పరశురాములు అన్నారు. ప్రభంజన్ యాదవ్ మరణవార్త విని బాధేసిందన్నారు. ప్రభంజన్ ఆత్మకు శాంతి సద్గతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు కన్న పరశురాములు ఒక ప్రకటనలో తెలిపారు.